


# స్వార్థం

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాదు

దండకారణ్యంలో ఆకాశమంత విశాలంగా పరుచుకున్న రావి చెట్టు ఒకటి ఉండేది. దానికింద సేదదీరితే ఎంతో చల్లగా, హాయిగా ఉండేది. ఒకసారి ముక్తికాంతుడనే ముని దానికింద కొన్ని సంవత్సరాల పాటు తపస్సు చేసి శివునిచే వరం పొందాడు. ఆ సంతోషంలో చెట్టుకింద నుండి వెళ్ళబోతూ... చెట్టువంక నిశితంగా ఒకమారు చూసి, అది పూర్వజన్మలో ఊర్ధ్వముఖుడనే గంధర్వుడని ఒక ఋషి శాపం వల్ల అలా అడవిలో మాను అయ్యాడని, తనలాగా ఎంతోమంది ఆ చెట్టునీడన విశ్రమించి, దాని గొప్పదనాన్ని మనస్ఫూర్తిగా తలచుకుంటే, ఆ చెట్టుకి శాప విమోచనం కలుగుతుందని దివ్య దృష్టితో తెలుసుకున్నాడు.

'ఓ వృక్షరాజమా! ఇన్నాళ్ళూ నీ చల్లని నీడలో నేను ఎటువంటి ఆటంకం లేకుండా తపస్సు చేసి ఉత్తమ ఫలితం పొందాను. నిజానికి నా ఫలితంలో నీకూ భాగం ఉంది. అందుకని నీకు నేను రెండు వరాలు ఇస్తున్నాను. ఒకటి మిగతా చెట్లలా కాకుండా నువ్వు మాట్లాడగలవు. రెండోది ఈ కీకారణ్యంలో జనం నీకు దగ్గరయ్యేలా మార్గం సుగమం

చేస్తాను.” అని వరాలిచ్చాడు.

‘ధన్యోస్మి మునివర్యా, నీకు నా హృదయపూర్వ కృతజ్ఞతలు’ అంది ఆనందంగా ఆ వృక్షం.

ముని చెప్పినట్టే వివిధ పనుల మీద జనం ఆ అడవికి, ముఖ్యంగా ఆ చెట్టువున్న చోటుకి తరలిరాసాగారు. ఆ చెట్టు వచ్చిన వాళ్ళని ఆప్యాయంగా పలకరించి, తనకింద సేదదీరమని అభ్యర్థించసాగింది. జనం దాని మంచి తనానికి మహదానందపడిపోయి... అక్కడే విశ్రమించసాగారు. ఆనోటా ఆనోటా విషయం అందరికీ పాకి ఆ మాట్లాడే చెట్టుకింద విశ్రమించడానికి తండోపతండాలుగా జనం రాసాగారు.

అయితే అంతంత మంది జనం రావడం తన కింద విశ్రమించడం గమనించి దానిలో స్వార్ధం అంకురించింది. తన శాపం సంగతి కూడా మర్చిపోయి.. వచ్చిన వాళ్ళు ఏవైనా కానుకలు తన మొదట్లో ఉన్న పెద్ద తొర్రలో వేస్తేనే తను విశ్రాంతి తీసుకోనిస్తానని... లేదంటే ఆకులు రాల్చి విశ్రాంతి భంగం చేస్తానని చెప్పింది. దాంతో ఆ చెట్టుకింద విశ్రమించేవాళ్ళు రాను రాను తక్కువయిపోయారు. సేదతీరే వాళ్ళు కూడా కానుకలు వేస్తుండటంతో.. ఆ చెట్టు గొప్పదనాన్ని ప్రశంసించడం మానేశారు.

కొంతకాలం తర్వాత ఆ పక్కనుంచి వెళుతున్న ముని ఆ పాటికి చెట్టుకి శాపవిముక్తి కలిగి వుంటుందనుకున్నాడు. కాని జనం లేక వెల వెలబోతున్న చెట్టుని చూసి ఆశ్చర్యపోయి దివ్య దృష్టితో అసలు విషయం తెలుసుకుని.. కదలని మెదలని చెట్టుకి కానుకలెందుకు? ఏం చేసుకుంటుంది? స్వార్థపు ఆలోచనతో అలా చెట్టులా మిగిలిపోయిన దాని ప్రారబ్ధానికి చింతిస్తూ ముందుకు సాగిపోయాడు.

*మన వద్ద సిరిసంపదలు ఉన్నా లేకున్నా, అధికారం కలిగిన లేకున్నా - మంచి గుణాలు కలిగి ఉంటె ..ఎప్పటికి మనం ఒంటరి వాళ్ళం కాలేము.*

*విద్య వల్ల వినయం,వినయం వల్ల గౌరవం,గౌరవం వల్ల ధనం,ధనం వల్ల సుఖం సమకూరుతాయి.*

*వైఫల్యం నిరాశకి కారణం కాకూడదు. కొత్త ప్రేరణకి పునాది కావాలి.*